కాళేశ్వరమే రేపటి తెలంగాణ జీవధార






# బలగం TV

BALAGAM

నిజమే మా బలం.. ప్రజలే మా బలగం

BALAGAM TV DIGTAL NEWS PAPER/ balagamtv100@gmail.com

హైదరాబాద్ శనివారం, 03 మే-2025 | balagamtv100@gmail.com | పేజీలు-4



మోడీ చాలా టఫ్! త్వరలోనే భారత్‌తో అమెరికా బిగ్ డీల్





# ఆర్టీసీ సమ్మెకు మిగిలింది మూడు రోజులే!..

- సర్కార్ సైలెంట్.. యాజమాన్యం నుంచీ లేని స్పందన!
- 6 అర్ధరాత్రి నుంచే సమ్మెకు పిలుపు
- చర్చల ఊసెత్తి సర్కార్ సైలెంట్
- యాజమాన్యం నుంచీ స్పందన కరువు
- 7న ఉదయం నుంచే డిపోల్లో నిలిచిపోనున్న బస్సులు
- డిపోల్లో సమ్మె సన్నాహాల్లో జేఏసీ



హైదరాబాద్, మే 2 : ఈ నెల 6న అర్ధరాత్రి నుంచి సమ్మెకు దిగుతామని ఆర్టీసీ యాజమాన్యానికి కార్మిక సంఘాలు నోటీసులు ఇచ్చాయి. సమ్మె యోచనను విరమించాలంటూ స్వయంగా సీఎం రేవంత్‌రెడ్డి కోరారు. కానీ, శుక్రవారం సాయంత్రం వరకూ ప్రభుత్వం నుంచి, ఆర్టీసీ యాజమాన్యం నుంచి స్పందన రాలేదు. ఇక మిగిలింది మూడురోజులే. ఈ మూడురోజుల్లోపే ఏవైనా చర్చలు జరిగి సఫలమైతేనే సమ్మె యోచనను విరమిస్తామని, లేకుంటే యథాతథంగా సమ్మె జరుగుతుందని, 7న ఉదయం నుంచే అన్ని డిపోల్లో బస్సులు నిలిచిపోనున్నాయని కార్మిక సంఘాలు తేల్చిచెప్పాయి. 'ఆర్టీసీ కార్మికులను ఆదుకుంటాం.. ఇప్పుడు సమ్మెకు వెళ్తే ఇప్పుడిప్పుడే గాడిన పడుతున్న ఆర్టీసీ ఆగమవుతుంది. మీతో చర్చలు జరిపేందుకు నాకు ఎలాంటి భేషజాలు లేవు' అని సాక్షాత్తూ సీఎం చెప్పినా కూడా ఆర్టీసీ కార్మిక సంఘాలను సంప్రదించినవారే లేరు. సమ్మె గడువు దగ్గర పడుతుండగా చర్చల ఊసెత్తి సైలెంట్‌గా ఉన్న సర్కార్ తీరుపై ఆర్టీసీ కార్మికులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. సీఎం వ్యాఖ్యల మేరకు ఆర్టీసీ యాజమాన్యం శుక్రవారం చర్చలకు పిలుస్తుందని ఆశించిన కార్మిక సంఘాల నేతలకు తీవ్ర నిరాశే ఎదురైంది. సమ్మె తేదీ తాము ప్రకటించామని, కనీ సం చర్చల తేదీని యాజమాన్యం ప్రకటిస్తుందని ఎంతో ఆశతో ఎదురుచూశామని కార్మిక సంఘాల నేతలు చెప్పారు. సీఎం చొరవ


మిగతా 2లో..


# చేనేత కార్మికులకు గుడ్‌న్యూస్



హైదరాబాద్-మే 02: తెలంగాణలోని చేనేత కార్మికులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్త చెప్పింది. రాష్ట్రంలోని చేనేత కార్మికులకు అసలు, వడ్డీ కలిపి రూ.లక్ష వరకు రుణమాఫీ చేయాలని నిర్ణయించింది. ఈ పథకంలో భాగంగా 2017 ఏప్రిల్1వ తేదీ నుంచి 2024 మార్చి 31 వరకు అన్ని బ్యాంకులు, జిల్లా సహకార కేంద్ర బ్యాంకుల్లో వ్యక్తిగతంగా చేనేత వస్త్రాల ఉత్పత్తి, కార్యనిర్వహణ మూలధనం, ఇతర వృత్తి సంబంధిత కార్యకలాపాల కోసం రుణాలు తీసుకున్న వారికి మాత్రమే వర్తిస్తుందని రాష్ట్ర చేనేతశాఖ స్పష్టం చేసింది. ప్రధానమంత్రి రోజ్‌గార్ యోజన, చేనేత క్రెడిట్ కార్డుల కింద తీసుకున్న రుణాలను కూడా మాఫీ చేయనున్నట్లు వెల్లడించింది. రుణమాఫీ అమలుపై రాష్ట్ర చేనేతశాఖ ముఖ్య కార్యదర్శి శైలజారామయ్యర్ మార్గదర్శకాలు జారీ చేశారు. రుణమాఫీ అనంతరం చేనేత కార్మికులు కోరుకుంటే మళ్లీ ఆమేరకు రుణాన్ని బ్యాంకులు మంజూరు చేస్తాయి.ఎవరైనా కార్మికులు ప్రస్తుతం చేనేత కార్యకలాపాల్లో లేకపోయినా, వారి ఖాతాలు నిరర్థక ఆస్తుల ఖాతా(ఎన్‌పీఏ) కింద ఉన్నా.. మళ్లీ రుణాలు రావు. ప్రభుత్వ మార్గదర్శకాలను అనుసరించి సత్వరమే అర్హులైన చేనేత కార్మికుల రుణమాఫీకి అన్ని జిల్లాల ఏడీలు చర్యలు తీసుకోవాలని మార్గదర్శకాల్లో శైలజారామయ్యర్ వెల్లడించారు. దీనికి బ్యాంకులు సహకరించాలి కోరారు. కాగా, జిల్లా కలెక్టర్ అధ్యక్షతన ఉండే జిల్లాస్థాయి కమిటీలో డీసీసీబీ సీఈవో, చేనేతశాఖ ఆర్‌డీడీ, లీడ్ బ్యాంక్ మేనేజర్, నాబార్డు డీజీఎం, పరిశ్రమల శాఖ జీఎం, జిల్లా సహకార అధికారి సభ్యులుగా ఉంటారు. చేనేత శాఖ ఏడీ కన్వీనర్‌గా ఉంటారు. జిల్లా పరిధిలో చేనేత కార్మికులు నిర్దిష్ట కాలంలో రుణాలు పొందిన వివరాలను శాఖ ఏడీలు బ్యాంకర్ల నుంచి తీసుకోవాలి. వాటి ఆధారంగా కార్మికు లవారీగా క్లెయిమ్‌లను తయారు చేసి జిల్లాస్థాయి కమిటీ ఆమోదం కోసం పంపించాలి. జిల్లాస్థాయి కమిటీ ఆమోదం తర్వాత రాష్ట్ర స్థాయి కమిటీకి ప్రతిపాదనలు పంపిస్తారు. చేనేతశాఖ డైరెక్టర్ అధ్యక్షత వహించే ఈ కమిటీలో రాష్ట్రస్థాయి బ్యాంకర్ల కమిటీ, టెస్కాబ్, నాబార్డు రాష్ట్రస్థాయి అధికారులు సభ్యులుగా ఉంటారు. అదనపు డైరెక్టర్ కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. జిల్లా స్థాయి కమిటీ నుంచి వచ్చిన ప్రతిపాదనలను రాష్ట్రస్థాయి కమిటీ ఆమోదించిన తర్వాత రుణమాఫీ మొత్తం ఆయా చేనేత కార్మికుల ఖాతాల్లో జమ అవుతుంది. అనంతరం బ్యాంకర్లు ఎలాంటి బకాయిల్లేవని(నో డ్యూస్) ధ్రువీకరణ పత్రం ఇస్తారు.

# విద్యార్థులకు తీపికబురు..

## తెలంగాణలో 'దోస్త్' నోటిఫికేషన్ రిలీజ్ !




హైదరాబాద్-మే 02: తెలంగాణలో డిగ్రీ చదవాలనుకునే విద్యార్థులకు శుభవార్త. డిగ్రీ ఆన్‌లైన్ ప్రవేశాల (DOST) 2025-26 నోటిఫికేషన్‌ను విడుదల అయ్యింది. ఈ నోటిఫికేషన్ ను రాష్ట్ర ఉన్నత విద్యా మండలి చైర్మన్ బాలకృష్ణ రెడ్డి, కళాశాల విద్యా శాఖ కమిషనర్ శ్రీ దేవసేన కలిసి రిలీజ్ చేశారు. ఈ ప్రక్రియతో లక్షలాది మంది విద్యార్థులకు ఉన్నత విద్యలో అడుగుపెట్ట నున్నారు. ప్రస్తుతం రాష్ట్రంలోని డిగ్రీ కళాశాలల్లో మొత్తం 4,67,456 సీట్లు అందుబాటులో ఉన్నాయని అధికారులు వెల్లడిం చారు. ఈ క్రమంలోనే బాలకృష్ణ రెడ్డి తెలిపిన ప్రకారం.. ఈ సంవత్సరం మూడు విడతలుగా డిగ్రీ ప్రవేశాలు జరుగనున్నాయని తెలుస్తోంది. మొదటి విడత దరఖాస్తుల కోసం మే 3 నుండి 21 వరకు అవకాశం ఉంటుంది. మే 10 నుండి 22 వరకు విద్యార్థులు తమకు నచ్చిన కళాశాలలు, కోర్సులను వెబ్ ఆప్షన్ల రూపంలో ఎంచుకోవచ్చు. ఆ తర్వాత సీట్ల కేటాయింపు మే 29న ప్రకటించబడుతుంది. చివరగా తరగతులు జూన్ 30వ తేదీ నుంచి ప్రారంభం కానున్నాయి. ఇక రాష్ట్రవ్యాప్తంగా మొత్తం 1,057 డిగ్రీ కళాశాలలు ఉండగా, వాటిలో 987 కళాశాలలు దోస్త్ పరిధిలోకి వస్తున్నాయి. మిగిలిన 70 కళాశాలలు ఈ ప్రక్రియలో పాల్గొనడం లేదని స్పష్టం చేస్తున్నారు. ఈ ఏడాది నుంచి బకెట్ సిస్టమ్ ప్రవేశాలలో అమల్లోకి రానుంది. అలాగే ప్రభుత్వం జారీ చేసిన తాజా ఉత్తర్వుల ప్రకారం రిజర్వేషన్ నిబంధనలు అనుసరించి సీట్లు కేటాయించబడతాయి. పూర్తి వివరాల కోసం https://dost.cgg.gov.inఅధికారిక వెబ్ సైట్ ను చూడొచ్చు.

# తెలంగాణకు తప్పని తాగునీటి కటకట..

- అడుగంటిన సాగర్, శ్రీశైలం జలాశయాలు
- అడుగంటిన నాగార్జునసాగర్, శ్రీశైలం జలాశయాలు
- రెండింట్లో కలిపి ఉన్నది నికరంగా 15 టీఎంసీలే
- తాగునీటికి మాత్రం 25 టీఎంసీలకు పైనే అవసరం
- ఇప్పటికే ఈ ఏడాది 73శాతం జలాలను తరలించిన ఏపీ
- తాజాగా మరో10 టీఎంసీలు కావాలంటూ డిమాండ్



హైదరాబాద్, మే 2 : నాగార్జునసాగర్, శ్రీశైలం డ్యామ్‌లపై ఆధారపడినవారు తాగునీటి ఎద్దడిని ఎదుర్కోనున్నారు. రెండింటిలో కలిపి ప్రస్తుతం నికరంగా 15 టీఎంసీల నీరే అందుబాటులో ఉండగా, అవసరాలు మాత్రం దాదాపు 25 టీఎంసీలకుపైనే ఉన్నాయి. ఈ నేపథ్యంలో అందుబాటులో ఉన్న జలాల పంపిణీ కోసం సోమవారం త్రీమెంబర్ కమిటీ సమావేశం నిర్వహిం చాలని కేఆర్ఎంబీ నిర్ణయించింది. ఈ మేరకు ఇరు రాష్ట్రాలకు లేఖ రాసింది. రిజర్వాయర్లు అడుగంటడంతో తెలంగాణకు తాగునీటికి తండ్లాట తప్పని దుస్థితి నెలకొన్నది. శ్రీశైలం నుంచి ఉమ్మడి మహబూబ్‌నగర్‌పాటు ఏడు జిల్లాల తాగునీటి అవసరాలను తీర్చాల్సి ఉంది. సాగర్‌పై హైదరాబాద్‌తోపాటు, ఉమ్మడి నల్లగొండ, ఖమ్మం జిల్లాల తాగునీటి అవసరాలు ఆధారపడి ఉన్నాయి. మే, జూన్ నెలల్లో నికరంగా రెండు ప్రాజెక్టుల నుంచి తెలంగాణకు తాగునీటి కోసం దాదాపు 12-15 టీఎంసీలు అవసరం. కానీ ప్రస్తుతం ఆ మేరకు జలాలు అందుబాటులో లేవు. నాగార్జునసాగర్ డెడ్‌స్టోరేజీ 510 అడుగులు కాగా ఆ లెవల్‌లో 131 టీఎంసీలు రిజర్వాయర్‌లో


మిగతా 2లో..


# హైదరాబాద్‌లో భారీ వర్షం,



హైదరాబాద్-మే 02: హైదరాబాద్ నగరంలో గురువారం సాయంత్రం నుంచి వాతావరణం ఒక్కసారిగా మారిపోయిం ది. మధ్యాహ్నం వరకు ఎండ తీవ్రత ఎక్కువగా ఉండగా.. సాయంత్రం నల్లని మేఘాలు కమ్ముకు న్నాయి. ఆ తర్వాత నగరంలోని పలు ప్రాంతాల్లో భారీ వర్షం కురిసింది. మరికొన్ని ప్రాంతాల్లో తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు కురిశాయి. పలు చోట్ల వడగండ్లు కూడా పడటం గమనార్హం. జూబ్లీహిల్స్, బంజారాహిల్స్, పంజాగుట్ట, అమీర్‌పేట, ఖైరతాబాద్, గచ్చిబౌలి, హైటెక్ సిటీ, బోరబండ, కూకట్‌పల్లి, మియాపూర్, కుత్బుల్లాపూర్, నిజాంపేట్, బాచుపల్లి, కొంపల్లి, గాజులరామారం, సూరారం,


మిగతా 2లో..


# ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై కీలక ఆదేశాలు

- రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ

# తరలని ధాన్యం.. తడిపిన వర్షం..

- కల్లాల నిండా కర్షకుల కన్నీళ్లే!
- నిలిచిన కొనుగోళ్లు.. ముంచిన వాన..
- అకాలవర్షంతో అన్నదాతకు తీవ్ర నష్టం
- చెడగొట్టు వానతో ఆగమైన రైతాంగం
- సెంటర్లలో తడిసి ముద్దయిన ధాన్యం

హైదరాబాద్, మే 2 : రాష్ట్ర ప్రభుత్వ నిర్లక్ష్యం రైతుల పాలిట తీరని నష్టాలను తెచ్చిపెట్టింది. చేతికొచ్చిన పంట అమ్మే దశలో వర్షం పాలైంది. మార్కెట్లు, ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో సకాలంలో కొనుగోళ్లు చేపట్టని ఫలితంగా రోజులకొలదీ ఉన్న వరి ధాన్యం, మిర్చి, మక్కలు గురు, శుక్రవారాల్లో కురిసిన అకాల వర్షానికి తడిసి ముద్దయ్యాయి. రాష్ట్రవ్యాప్తంగా ఎందరో రైతులకు తీరని నష్టాన్ని మిగిల్చింది. ఉమ్మడి వరంగల్ జిల్లావ్యాప్తంగా కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసి ముద్దయింది. తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం పూర్తిగా కొనుగోలు చేయాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. మహబూబాబాద్, ము లుగు జిల్లాలో వర్షం ప్రభావం తీవ్రంగా ఉండగా, వరంగల్, భూపాలపల్లి జిల్లాల్లో స్వల్పంగా ఉన్నది. ధాన్యం రాశులపై పరదాలను కప్పినప్పటికీ బలమైన గాలులతో అవి లేచిపోయాయి. మార్కెట్‌కు తెచ్చిన మిర్చి బస్తాలు తడవగా, మక్కలు కొట్టుకుపోయాయి. అక్కడక్కడా వరి పైరు నేలవాలింది. బొప్పాయి తోటలు ధ్వంసమయ్యాయి. మామిడికాయలు రాలిపోయాయి. ఆరు గాలం కష్టపడి ధాన్యం అమ్ముకునే సమయంలో నష్టపోవడంతో రైతులు కన్నీటి పర్యంతమవుతున్నారు. ఉమ్మడి నల్లగొండ జిల్లాలో పలుచోట్ల కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసింది. కోతకొచ్చిన వరిపొలాలు నేలవాలాయి. మర్రిగూడ మండలకేంద్రంతోపాటు వివిధ గ్రామాల్లో కోతకు వచ్చిన వరిచేలు నేలవాలాయి. 50 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్టు అంచనా. ఖమ్మం జిల్లా కూసుమంచి, నేలకొండపల్లి, తిరుమలాయపాలెం మండలాల్లోని పలు గ్రామాల్లోని కొనుగోలు కేంద్రాల్లో ఉన్న ధాన్యపు రాశులు తడిసి ముద్దయ్యాయి. కూసుమంచి మండలం చేగొమ్మ గ్రామంలో ధాన్యం తడవగా, మరో 10 రోజుల్లో కోయాల్సి ఉన్న మామిడిపండ్లు కూడా ఈదురుగాలులకు నేలరాలాయి.



## మండేపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులకు జిల్లా కలెక్టర్ అభినందన



బలగంటివి, సిరిసిల్ల: పదవ తరగతిలో తంగళ్ళపల్లి మండలం మండేపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు ఉత్తమ ప్రతిభను కనబరిచిన ందుకు గాను కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అభినందించారు. ఎం.అక్షయ 573, కె ప్రణయ్ 560, బి.శ్రీవిద్య 560, టి.సిరి 559, హర్షవీణ 551,గౌతమి550 మార్కులుసాధించినందుకుగానూకలెక్టర్ అభినందిస్తూ ఐఐటి నీట్ లక్ష్యంగా కష్టపడి చదవాలని సూచించారు.ఈ కార్యక్రమంలో పాఠశాల ప్రిన్సిపల్ ఎం.విఠల్, ఉపాధ్యాయులు ఆర్ రమేష్, మొహమ్మద్ హనీఫ్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## నాణ్యత ప్రమాణాల ప్రకారం ధాన్యం కొనుగోలు..

- చివరి గింజ వరకు మద్దతు ధర చెల్లించి ధాన్యం కొనుగోలు చేస్తాం
- ప్రభుత్వ విప్ అది శ్రీనివాస్



బలగం టివి, వేములవాడ:జిల్లాలోని రైతు సోదరులు గత బిఆర్ఎస్ పాలనలో ధాన్యం కొనుగోలు, ప్రజాపాలనలోజరుగుతున్న ధాన్యం కొనుగోలు మధ్య తేడాను గమనించాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు.శుక్రవారం కోనరావుపేట మండలంలోని నాగారం గ్రామంలోని వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో వేగవంతంగా వడ్ల కొనుగోలు జరుగుతుందని, రైతులు పండించిన చివరి గింజ వర కు ప్రభుత్వం కొనుగోలు చేస్తుందని అన్నారు.రైతులు ఎవరు కూడా ఆందోళన చెందవద్దని అన్నారు. మే01నాటికి గత ప్రభుత్వం కం టే ఎన్నో రెట్లు అధికంగా ధాన్యం కొనుగోలు చేయడమే కాకుండా కొనుగోలు చేసిన ధాన్యంలో రైతులకు వడ్ల డబ్బులు సకాలంలో చెల్లిస్తున్నామనిఅన్నారు. భారత ఆహార సంస్థ నిర్దేశించిన నాణ్యత ప్రమాణాలు పాటిస్తూ రైతులు కొనుగోలు కేంద్రాలకు ధాన్యాన్ని తీసుకుని వస్తే వెంటనే కొనుగోలు చేస్తున్నామని, నాణ్యత ప్రమాణాలను పరీక్షించి ధాన్యం కొనుగోలు చేయడం జరుగుతుందని అన్నారు. ప్రభుత్వం చివరి గింజ వరకు ధాన్యం కొనుగోలు చేస్తుందని, రైతులు ఎవ్వరు కూడా రాజకీయాల ఆకాంక్షల కోసం తప్పుడు ప్రచారాలు చేసే వారి మాటలు నమ్మవద్దని, ప్రతి రైతు వద్ద నుంచి ధాన్యం సేకరించి మద్దతు ధరను ప్రభుత్వం చెల్లిస్తుందని అన్నారు.

## రీచ్ ది అన్ రీచ్డ్ అనే థీమ్‌తో ఎమ్మెల్యే అన్ వీల్స్



- వారంలో మూడు రోజులు 'ఎమ్మెల్యే ఆన్ వీల్స్'
- మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ

బలగం టివి, సిరిసిల్ల: రీచ్ దిఅన్ రీచ్డ్ అనేథీమ్‌తో ఎమ్మెల్యే అన్ వీల్స్ కార్యక్రమం ఏర్పాటు చేశామని,ప్రతి వారంలో మూడు రోజులు 'ఎమ్మెల్యే ఆన్ వీల్స్' కార్యక్రమాల తో ప్రజలకు మరింత చేరువగా ఉంటానని మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ అన్నారు.శుక్రవారం మానకొం డూర్ నియోజకవర్గం ఇల్లంత కుంట మండలం అనంతారం గ్రామంలో ఎమ్మెల్యే ఆన్ వీల్స్ కార్యక్రమాన్ని నిర్వహించగా,ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా హాజరయ్యారు. ఈ సంద ర్భంగా గ్రామంలో నెలకొన్న క్షేత్రస్థాయి సమస్యలను ఎమ్మెల్యే, కలెక్టర్ దృష్టికి గ్రామస్తులు తీసుకురాగా,వాటిని తక్షణమే శాసనసభ్యులు డా.కవ్వంపల్లి సత్యనారాయణ, కలెక్టర్ సందీప్ కుమార్ ఝా పరిష్కరించారు. అనంతరం మానకొండూరు ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్య నారాయణ మాట్లాడుతూ రీచ్‌దిఅన్‌రీచ్డ్ అనే థీమ్ తో ఎమ్మెల్యే అన్ వీల్స్ కార్యక్రమం ప్రారంభించామని, ప్రజాసమస్యల పరిష్కారానికి రాష్ట్ర ప్రభుత్వం కట్టుబడి ఉందని అన్నారు. సమస్యలను తెలుసుకోవడమే కాకుండా వాటిని పరిష్కరించేందుకు సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించుకునే లా ఎమ్మెల్యే ఆన్ వీల్స్ అనే యాప్‌ను తయారు చేయించి ప్లే స్టోర్‌లో అందుబాటులో ఉంచామని, ఈ యాప్‌ను నియోజక వర్గంలోని 2.28 లక్షల మంది ఓటర్ల ఐడీకి అనుసంధానం చేయించామని అన్నారు. ఓటర్లు తమ సమస్యలను నేరుగా ఈ యాప్‌లోఅప్‌లోడ్(నమోదు) చేసుకుంటే వాటిని అధికార బృందం పరిశీలించిపరిష్కరిస్తుందని, పరిష్కారాలను, ఇతరత్రా సమాచారాన్ని నోటిఫికేషన్ల ద్వారా ఆయా ఫిర్యాదుదారులకు పంపిస్తారానిఅన్నారు. మండల స్థాయిలో పరిష్కారం కాని సమస్యలను జిల్లా, రాష్ట్ర స్థాయిఅధికారులకు, అవసరమైతే సంబందిత మంత్రులు, ముఖ్యమంత్రి దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. అనంతారం గ్రామంలో డ్రైనేజీ, సీసీ రోడ్లు, తదితర అభివృద్ధి పనులకు వెంటనే నిధులు కలెక్టర్ సందీప్ కుమార్ ఝా మంజూరు చేశారు.ఈ కార్యక్రమంలో పంచాయితీ రాజ్ ఈఈ సుదర్శన్ రెడ్డి, తహశీల్దార్ ఫారుక్, ఎంపీడీఓ శశికళ, సీఐమొగిలి, ఎస్సై శ్రీకాంత్, ఎంపీఓ శ్రీనివాస్, తదితర రెవెన్యూ, పంచాయితీరాజ్, సెస్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

## విద్యార్థులను సన్మానించిన జిల్లా కలెక్టర్



బలగం టివి,ఎల్లారెడ్డిపేట: రాజన్న సిరిసిల్ల జిల్లా ఎల్లారెడ్డిపేట మండలం బండలింగంపల్లి ప్రభుత్వ పాఠశాలలో పదవతరగతి ఫలితాల్లో అత్యున్నత మార్కులు సాధించిన విద్యర్థులనుకలెక్టర్ సందీప్ కుమార్‌ఝా ఘనంగా సన్మానించారు.స్కూల్ టాపర్లుగా నిలిచిన కె.మనీషా546, హలీమా 544, కె.రోజా 529, ఎండీ. మైస528ఎస్ కే. సుగ్ర 525లను కలెక్టర్ శాలువా, పూల బొకేలతో ఘనంగా సన్మానించారు. ప్రభుత్వ పాఠశాలలో చదివిన ఎంతోమంది మేధావులు సమాజంలో అనేక రంగాల్లో ఉన్నారని, మీరు కూడా ఒక లక్ష్యాన్ని పెట్టుకొని కష్టపడి చదివి భవిష్యత్తులో మంచి ఆఫీస ర్లు స్థిరపడి, తల్లిదండ్రులకు, గ్రామానికి, ఉపాధ్యాయులకు మంచి పేరు తేవాలని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. ఇంత మంచి ఫలితాలు సాధించ డానికి కృషిచేసిన ఉపాధ్యాయ బృందాన్ని కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అభినందించారు.ఉపాధ్యాయుని ఉపాధ్యాయులు,పాల్గొన్నారు.

## ఆర్టీసీ సమ్మెకు మిగిలింది మూడు రోజులే!..

(మొదటిపేజీ తరువాయి)

తీసుకోకపోతే ఆర్టీసీ సమ్మె కచ్చితంగా జరిగి తీరుతుందని స్పష్టంచేశారు. సమ్మెపై ఈ ఆదివారం సాయంత్రం లేదా సోమవారం ఉదయం మంత్రి పొన్నం ప్రభాకర్ సమక్షంలో ఆర్టీసీ యాజమాన్యం చర్చలకు ఆహ్వానిస్తుందని విశ్వసనీయంగా తెలిసింది. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీ నం చేసే అంశాన్ని ప్రభుత్వం మొదటిరోజు చర్చల్లో స్వాగతిస్తుందా? వ్యతిరేకిస్తుందా? అనే విషయంపై స్పష్టత రావాల్సి ఉన్నది. ఎందుకంటే సీఎం రేవంత్‌రెడ్డి 'రాష్ట్రం అప్పు ల్లో ఉన్నది. సరిపడా జీతాలు ఇచ్చేందుకే నిధులు సరిపోవడం లేదు. అన్నీ ఇప్పుడే చేయలేను. ఉద్యోగులు ఆలోచన చేయాలి. నేనేం చేయాలో మీరే చెప్పండి' అంటూ సీఎం పదేపదే వల్లె వేస్తున్నారు. దీంతో ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వంలో విలీనం చేస్తే ఆ భారం ఆర్థికశాఖపై పడుతుందని ముందే బేరీజు వేసుకున్న ప్రభుత్వ పెద్దలు.. ఈ నిర్ణయాన్ని స్వాగతించరనే అనుమానాలు కార్మికుల్లో సైతం రేకెత్తుతున్నాయి. ఆర్టీసీ ఉద్యోగులను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించాలని కార్మిక సంఘాలు పట్టుబడితే.. మొదటి దఫా చర్చలు విఫలమయ్యే అవకాశాలు లేకపోలేదని రాజకీయ నిపుణులు చెప్తున్నారు. తమ సమ్మె డిమాండ్లపై ప్రభుత్వం స్పందిస్తుందనే ఆశతోనే ఇంకా ఆర్టీసీ కార్మిక సంఘాలు ఉన్నాయి. మేడే రోజు సీఎం చేసిన వ్యాఖ్యలను స్వాగతించాయి. సమ్మెపై ప్రభుత్వం చర్చలకు ఆహ్వానిస్తే నిరభ్యంతరంగా వెళ్తామని, ఒకవేళ చర్చలకు పిలువకపోతే సమ్మెకు వెళ్తామని కరాఖండిగా చెప్తున్నారు. ఈనెల 6వ తేదీ అర్ధరాత్రి నుంచే అన్ని డిపోల్లో ఎక్కడి బస్సులు అక్కడే నిలిచిపోనున్నాయి. 7వ తేదీ ఉదయం నుంచే సమ్మె పూర్తిస్థాయిలో ప్రా రంభం అవుతుందని కార్మిక సంఘాల నేతలు చెప్తున్నారు. ఈ నేపథ్యంలో కార్మిక నేతలు సమ్మె సన్నాహాల్లో ఉన్నారు. ఇప్పటికే సమ్మె సన్నాహక పోస్టర్లు అన్ని డిపోలకు చేరాయి. ఆయా డిపోల్లో ఆ పోస్టర్లను ఆవిష్కరించి, బస్సులకు, డిపోల్లో, జనం అధికంగా ఉండే ప్రాంతాల్లో అతికిస్తున్నారు. ఇక తాము చేసేదేమీ లేదని, చేయాల్సిందతా ప్రభుత్వం, ఆర్టీసీ యాజమాన్యానిదేనని కార్మిక సంఘాల నేతలు అంటున్నారు.

## హైదరాబాద్‌లో భారీ వర్షం,

(మొదటిపేజీ తరువాయి)



జీడి మెట్ల, తదితర ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షం కురిసింది. బండ్లగూడ జాగీర్ కార్పొరేషన్ పరిధిలోని హైదర్ షా కోట్, కిస్మత్ పూర్, బండ్లగూడలో వడగండ్లతో వర్షం కురిసింది. మణికొండ, నార్సింగి, పుప్పాలగూడ, హిమాయత్ సాగర్, గండిపేట ప్రాంతాల్లో మోస్తరు వర్షం కురిసింది. ఒక్కసారిగా కురిసిన భారీ వర్షంతో రహదారులు, లోతట్టు ప్రాంతాలు జలమయమ య్యాయి. దీంతో వాహనదారులు, ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. సికింద్రాబాద్ నుంచి హైటెక్ సిటీ, ఖైరతాబాద్ నుంచి కూకట్ పల్లి, హైటెక్ సిటీ నుంచి లింగంపల్లి రూట్లలో భారీగా వాహనాలు నిలిచిపోయాయి. ఆఫీసుల నుంచి ఇళ్లకు వెళ్లే సమయం కావడంతో రూడ్లపై కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోవడంతో వాహనదా రులకు ఇబ్బందులు తప్పలేదు. భారీ వర్షం కురియడంతో నగరవాసు లకు వాతావరణ శాఖ తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించింది.

## మహిళలు ఎలాంటి సమస్య ఉన్న నిర్భయంగా పోలీస్‌లను సంప్రదించండి

### ఎస్పీ మహేష్ బి.గితే



బలగం టివి, రాజన్న సిరిసిల్ల: విద్యార్థినులు, మహిళలు వేధింపులకు గురైనప్పుడు భయపడొద్దని, ధైర్యంగా ముందుకు వచ్చి ఫిర్యాదు చేస్తే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్పీ మహేష్ బి.గితే శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు.ఈ సందర్భంగా ఎస్పీ మహేష్ బి.గితే మాట్లాడుతూ విద్యార్థినులు,మహిళలు అభద్రత బావనికి గురైనప్పుడు భయపడొద్దని, ధైర్యంగా ముందుకు వచ్చి షీ టీం కి ఫిర్యాదు చేస్తే నిందితులపై కఠిన చర్యలు తీసుకుంటామని అన్నారు. జిల్లాలో మహిళల, విద్యార్థినిల రక్షణకై ప్రత్యేక చర్యలు తీసుకోవడం జరుగుతోందని ప్రధానంగా మహిళలు,విద్యార్థినిలు అపరిచిత వ్యక్తులతో అప్రమత్తంగా ఉండాలని,వ్యక్తిగత సమాచారాన్ని వారితో పంచుకోవద్దని,ముఖ్యంగా సామాజిక మాద్యమాల్లో పరిచమయయ్యే వ్యక్తులతో మరింత అప్రమత్తం ఉండాలని అన్నారు. మహిళలు తాము పనిచేసే ప్రదేశాల్లోగాని,మరేక్కడ్కైన ల్కైంగిక వేధింపులకు గురౌవుతున్న, ర్యాగింగ్ లాంటి వేధింపులకు గురౌవుతున్న మహిళలు,విధ్యార్థునులు, బాలికలు మౌనంగా ఉండకుండా ధ్కైర్యంగా పిర్యాదు చేయాలన్నారు. ఎవరైనా ఆకతయులు మహిళలను, యువతులను వేధింపులకు గురిచేస్తే కఠిన చర్యలు తప్పవని అన్నారు. విద్యా సంస్థలల్లో కానీ,రోడ్డుపై వెళ్లేటప్పుడు,పని చేసే ప్రదేశాల్లో అవహేలనగా మాట్లాడిన ఉద్దేశపూర్వకంగా వెంబడించిన వెంటనే డయల్100 లేదా జిల్లా షీ టీమ్ నెంబర్ 8712656425 పిర్యాదు చేసినచో వారి మీద చట్టపరమైన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని తెలిపారు.

## తెలంగాణకు తప్పని తాగునీటి కటకట..

(మొదటిపేజీ తరువాయి)




ఉంటాయి. ప్రస్తుతం సాగర్ మట్టం 514 అడుగులకు చేరుకోగా 138 టీఎంసీలు అందుబాటులో ఉన్నాయి. అంటే 7 టీఎంసీల జలాలే వినియోగించుకునే అవకాశముంది. ఇక శ్రీశైలం ప్రాజెక్టు డెడ్‌స్టోరేజీ 834 ఫీట్లు కాగా, ఆ స్థాయిలో 57 టీఎంసీలు అందుబాటులో ఉంటాయి. అయితే శ్రీశైలం ప్రాజెక్టు నీటిమట్టం ఇప్పటికే డెడ్‌స్టోరేజీ దిగువకు వెళ్లిపోయింది. ప్రస్తుతం రిజర్వాయర్ లెవల్ 814 ఫీట్లకు చేరుకోగా, డ్యామ్‌లో 37 టీఎంసీలు మాత్రమే ఉన్నాయి. ఇక్కడ 800 ఫీట్ల నుంచి కూడా జలాలను వినియోగించుకునే వెసులుబాటు ఇరు రాష్ట్రాలకు ఉంది. ఆ స్థాయికి వెళ్లినా అప్పటికి డ్యామ్‌లో 29 టీఎంసీలు ఉంటాయి. అందులో నికరంగా వినియోగానికి అందుబాటులో ఉండే జలాలు 8 టీఎంసీలే. వెరసి రెండు రిజర్వాయర్లలో కలిపి ఇప్పటికి అందుబాటులో ఉన్నది 15 టీఎంసీలు మాత్రమే. ఆవిరి నష్టాలు, రవాణా నష్టాలు పోగా నికరంగా 12 టీఎంసీలకు మించి అందుబాటులో ఉండకపోవచ్చని అధికారులు వివరిస్తున్నారు. మరోవైపు మే, జూన్ నెలల్లో తాగునీటి కోసం ఇరు రాష్ట్రాలకు కలిపి దాదాపు 22 టీఎంసీల మేరకు అవసరమవుతాయి. అంటే దాదాపు 10 టీఎంసీల జలాలు కొరత ఏర్పడనున్నట్టు తెలుస్తున్నది. ఈ ఏడాది కృష్ణాబేసిన్‌లో 845 టీఎంసీల మేరకు సముద్రంలో కలిశాయి. సముద్రంలో కలిసిన జలాలు పోగా దాదాపు ఇరు రాష్ట్రాలకు కలిపి 1023కు పైగా టీఎంసీలు ఈ ఏడాది అందుబాటులోకి వచ్చాయి. అందులో ఏపీ ఇప్పటికే తన తాత్కాలిక కోటా 66 శాతానికి మించి 73 శాతం జలాలను తరలించుకుపోయింది. తెలంగాణ తాత్కాలిక కోటా 34 శాతం కాగా, ఆ జలాలను కూడా పూర్తిస్థాయిలో వాడుకోలేదు. ప్రస్తుతం నికరంగా 15 టీఎంసీలే అందుబాటులో ఉంటే అందులో నుంచి తాగునీటి అవసరాల కోసం తమకు 10 టీఎంసీలు కావాలని ఏపీ బోర్డుకు ఇండెంట్ పెట్టడం గమనార్హం. రెండు ప్రధాన జలాశయాల్లో నీరు అడుగంటిపోయిన నేపథ్యంలో ఈ నీటి సంవత్సరంలో తొలిసారి కృష్ణా రివర్ మేనేజ్‌మెంట్ బోర్డు (కేఆర్ఎంబీ) త్రీమెంబర్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేస్తున్నది. జలసౌధలో 5న (సోమవారం) ఉదయం సమావేశం జరుగనున్నట్టు ఇరురాష్ట్రాలకు లేఖలు రాసింది. ప్రధానంగా రిజర్వాయర్ల నుంచి తాగునీటి వినియోగానికి సంబంధించిన అంశంపై చర్చించనున్నట్టు వెల్లడించింది. ఈ కమిటీ ప్రతి ఏటా సీజన్ల వారీగా ఎప్పటికప్పుడు సమావేశాలను ఏర్పాటు చేస్తుంది. రాష్ట్రాల డిమాండ్లను, అందుబాటులో ఉన్న నీటినిల్వలను పరిగణనలోకి తీసుకొని ఇరు రాష్ట్రాలకు నీటివాటాలను కేటాయిస్తుంది. కానీ ఈ ఏడాది ఏ దశలోనూ త్రీమెంబర్ కమిటీ సమావేశాన్ని ఏర్పాటు చేయలేదు. నీటివిడుదల ఆర్డర్లు ఇవ్వలేదు. ఏపీ జలాలను తరలించుకుపోతున్నదని తెలంగాణ ఫిర్యాదు చేసినా నిమ్మకునీరెత్తినట్టు వ్యవహరించింది.

## ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై కీలక ఆదేశాలు

### రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ

హైదరాబాద్-మే 02: ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణంపై రాష్ట్ర మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి కీలక ఆదేశాలు జారీ చేశారు. శుక్రవారం ఆయన సీఎస్ రామకృష్ణారావుతో కలిసి ఇందిరమ్మ ఇళ్లు, నీట్ పరీక్ష ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్లు, ఎస్పీలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి.. ఇందిరమ్మ ఇళ్లకు లబ్ధిదారుల ఎంపికను వేగవంతం చేయాలని అధికారులను ఆదేశించారు. ఎంపిక చేసిన లబ్ధిదారుల జాబితా ఇంఛార్జీ మంత్రులు ఆమోదం పొందాలన్నారు.ఇందిరమ్మ ఇళ్లు విస్తీర్ణం 600 చదరపు అడుగులు మించకూడదని మంత్రి పొంగులేటి స్పష్టం చేశారు. ప్రతి నియోజకవర్గంలో పట్టణ ప్రాంతంలో 500 ఇళ్లు నిర్మించాలన్నారు. మే 5 నుంచి 20 వరకు 28 మండలాల్లో భూభారతి సదస్సులు నిర్వహించనున్నట్లు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. ఇందిరమ్మ ఇళ్లకు అనర్హులని తేలితే ఇళ్ల నిర్మాణం మధ్యలో ఉన్నా సరే రద్దు చేస్తామన్నారు. జాబితా-1, జాబితా-2, జాబితా-3లతో సంబంధం లేకుండా నిరుపేదలను ఎంపిక చేయాలని మంత్రి పొంగులేటి అధికారులకు స్పష్టం చేశారు. మే 4న జరగనున్న నీట్ పరీక్షకు ఏర్పాట్లు చేయాలని అధికారుల్ని ఆదేశించారు. ఈ ఏడాది రాష్ట్రం నుంచి 72,572 మంది విద్యార్థులు నీట్ పరీక్షకు హాజరవుతున్నట్లు తెలిపారు. ఇందుకోసం 24 జిల్లాల్లో 190 పరీక్ష కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు చెప్పారు. పరీక్ష కేంద్రాల్లో తాగునీరుతోపాటు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మెడికల్ కిట్లు అందుబాటులో ఉంచుకోవాలని అధికారులకు మంత్రి పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి సూచించారు.మరోవైపు, గత కేసీఆర్ పాలనపై మంత్రి పొంగులేటి విమర్శలు గుప్పించారు. కేసీఆర్ పాలనలో మంత్రులకు అధికారం లేదన్నారు. రెవెన్యూ వ్యవస్థను కేసీఆర్ నాశనం చేశారని మండిపడ్డారు. భూభారతిలో త్వరలో కొత్త సాఫ్ట్‌వేర్ రాబోతోందన్నారు. త్వరలో సర్వేయర్ల నోటిఫికేషన్ విడుదల చేస్తామని చెప్పారు. జూన్ లో సర్వే మ్యాప్ పైలెట్ ప్రాజెక్టు ద్వారా రిజిస్ట్రేషన్లు చేస్తామన్నారు. ఆరుగురు లైసెన్స్‌డ్ సర్వేయర్లను భర్తీ చేయబోతున్నామని తెలిపారు. ప్రైవేట్ సర్వేయర్లతో భూసర్వే జరిగినా ప్రభుత్వ పర్యవేక్షణ ఉంటుందని మంత్రి పొంగులేటి తెలిపారు.







## ఎన్టీఆర్ భరోసా పెన్షన్లతో సామాజిక భద్రత

### ప్రత్యేక అధికారి జి.జయలక్ష్మి వెల్లడి

విజయవాడ,మే2 : పేదలకు ఎన్‌టీఆర్ భరోసా ద్వారా సామాజిక భద్రత ఏర్పడుతోందని.. పేదల జీవన ప్రమాణాలను పెంచడంతో పాటు, శూన్య పేదరికం లక్ష్యంగా రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికతో పనిచేస్తున్నట్లు- రాష్ట్ర భూ పరిపాలన ప్రధాన కమిషనర్ , ఎన్‌టీఆర్ జిల్లా ప్రత్యేక అధికారి జి.జయలక్ష్మి అన్నారు. ఎన్‌టీఆర్ భరోసా ద్వారా సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీలో భాగంగా గురువారం సీసీఎల్‌ఏ జయలక్ష్మి అధికారులతో కలిసి విజయవాడ తూర్పు నియోజకవర్గం, వార్డు సచివాలయం-82 పరిధిలో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల ద్వారా ఇంటింటికి వెళ్లి పెన్షన్లు అందిస్తున్న ప్రక్రియను పరిశీలించారు. కేటగిరీల వారీగా లబ్ధిదారులకు పెన్షన్ మొత్తం సరైనవిధంగా అందుతుందా.. లేదా? అనే విషయాన్ని అడిగి తెలుసుకున్నారు. వార్డు సచివాలయం పరిధిలో 294 పెన్షన్లు ఉండగా.. ఎం.శ్రీను, బి.భూలక్ష్మి (దివ్యాంగ పెన్షన్లు), వై.వెంకటేశ్వరమ్మ,దుర్గా భవాని (విడో పెన్షన్లు)లకు పెన్షన్లు అందించే ప్రక్రియను పరిశీలించారు.జి.జయలక్ష్మి మాట్లా డుతూ అవకతవకలకు ఆస్కారం లేకుండా అత్యంత పారదర్శక ంగా, జవాబుదారీతనంతో ప్రభుత్వ మార్గదర్శకాలకు అనుగుణంగా పెన్షన్ల మొత్తాన్ని లబ్ధిదారుల ఇళ్ల వద్దే అందిస్తున్నట్లు- తెలిపారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో నియోజకవర్గాలు, మండలస్థాయి అధికారుల ప్రత్యక్ష పర్యవేక్షణతో ఎక్కడా ఎలాంటి ఇబ్బంది లేకుండా లబ్ధిదారులకు పెన్షన్లు అందించడం జరుగుతోందని తెలిపారు. సీసీఎల్‌ఏ వెంట యూసీడీ పీవో పి.వెంకట నారాయణ, సచివాలయ సిబ్బంది ఉన్నారు.

## పలకరిస్తూ..పెషన్లు పంచిన కలెక్టర్

విజయవాడ,మే2 : ఎన్‌టీఆర్ భరోసా ద్వారా సామాజిక భద్రత పెన్షన్ల పంపిణీలో భాగంగా గురువారం జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులతో కలిసి విజయవాడ అర్బన్ పరిధిలోని రామలింగేశ్వరనగర్‌లో పెన్షన్ల పంపిణీ కార్యక్రమంలో పాల్గొన్నారు. పెద్దాయనా బాగున్నారా.. పెన్షన్ సమయానికి అందుతోందా?, ఆరోగ్యం ఎలా ఉంది? ఎవరైనా మిమ్మల్ని డబ్బులు డిమాండ్ చేస్తున్నారా? అంటూ లబ్ధిదారులను ఆత్మీయంగా పలకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ లక్ష్మీశ మాట్లాడుతూ జిల్లాలో 2,28,388 పెన్షన్లకు రూ. 98.14 కోట్లు- మేర పంపిణీ చేయడం జరుగుతోందన్నారు. స్వర్ణాంధ్ర 2047 లక్ష్యాలకు అనుగుణంగా సమాజం నుంచి పేదరికాన్ని దూరం చేయడం, నూరు శాతం అక్షరాస్యత, తలసరి ఆదాయాన్ని గణనీయంగా పెంచడం, ప్రతి కుటు-ంబం నుంచి ఒక పారిశ్రామికవేత్త వచ్చేలా ప్రోత్సహించడం.. ఇలా పూర్తిస్థాయిలో పేదరిక నిర్మూలనకు చర్యలు తీసుకుంటు-న్నట్లు- తెలిపారు. ఇదే సమయంలో ప్రజలు ప్రభుత్వ సంక్షేమ పథకాలు, కార్యక్రమాలను సద్వినియోగం చేసుకుంటూ తమ కుటుంబాలను ఉన్నతంగా తీర్చిదిద్దుకోవాలని కలెక్టర్ లక్ష్మీశ పేర్కొన్నారు. కార్యక్రమంలో డీఆర్‌డీఏ పీడీ ఏఎన్‌వీ నాంచారరావు, యూసీడీ పీవో పి.వెంకట నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## శంషాబాద్‌లో బంగారం పట్టివేత

హైదరాబాద్,మే2:శంషాబాద్ ఎయిర్ పోర్టులో భారీగా బంగారం పట్టివేసారు.మస్కట్ నుంచి వచ్చిన విమాన సిబ్బంది వద్ద బంగారాన్ని డీఆర్‌ఐ అధికారులు స్వాధీనం చేసుకున్నారు. మస్కట్ నుంచి బంగారం తెచ్చి గ్రౌండ్ స్టాఫ్ కు ప్యాసింజర్లు అందించారు. ఎయిర్ పోర్ట్ నుంచి బంగారాన్ని బయటికి తీసుకొచ్చేందుకు గ్రౌండ్ స్టాఫ్ ప్రయత్నించగా.. 3.5 కిలోల బంగారాన్ని పట్టుకున్నారు. బంగారం స్మగ్లర్ కి సహకరించిన గ్రౌండ్ స్టాఫ్ ని డీఆర్‌ఐ అధికారులు పట్టు-కున్నారు. ఎయిర్ పోర్ట్ నుంచి పార్కింగ్ వరకు బంగారం తీసుకొచ్చి అప్పగిస్తుండగా పట్టు-కుని.. 3.5 కిలోల బంగారాన్ని సీజ్ చేశారు. పట్టుబడ్డ బంగారం విలువ దాదాపు 3 కోట్ల 45 లక్షల రూపాయలు ఉంటుందని అంచానా వేశారు.

## దూకుడు పెంచిన ఎసిబి

### ఏప్రిల్‌లో రికార్డుస్థాయిలో 21 కేసులు

హైదరాబాద్,మే1 : తెలంగాణ రాష్ట్రంలో అవినీతి నిరోధక శాఖ దూకుడు పెంచింది. అవినీతి, అక్రమాస్తుల విషయాల్లో కేసుల నమోదుతో దూసుకెళ్తుంది. కేవలం ఒక్క ఏప్రిల్ నెలలో మొత్తం 21 కేసుల నమోదు అయ్యాయి. 13 ఏసీబీ ట్రాప్ కేసులు, 2 అక్రమాస్తుల కేసులు, 2 క్రిమినల్ దుష్ప్రవర్తన కేసులు, 2 ఆశ్చర్యపరిచే తనిఖీ కేసులు, 2 సాధారణ కేసులు చేసినట్లు- ప్రకటించింది. 20 మంది ప్రభుత్వ ఉద్యోగులు అరెస్ట్, రిమాండ్ చేయబడ్డారు. కాగా, 5. 02 లక్షల సొమ్మును ఏసీబీ సీజ్ చేసింది. ఒక అధికారి ఇంట్లో సోదాలు చేసి 3.51 కోట్ల రూపాయల అక్రమాస్తులను గుర్తించింది. మాజీ ఊకఈ హరిరామ్ అక్రమాస్తులు మార్కెట్ వాల్యూ ప్రకారమ్ 13.50 లక్షల ఆస్తులుగా గుర్తించారు. లంచం డిమాండ్ చేస్తే 1064 కాల్ చేయాలని తెలంగాణ అవినీతి నిరోధక శాఖ అధికారులు పేర్కొన్నారు.

## లోన్ రికవరీ ఏజెంట్ల వేధింపులు

### తమిళనాట రైతు బలవన్మరణం

చెన్నై,మే2 : లోన్ రికవరీ ఏజెంట్ల వేధింపులకు ఒక రైతు బలయ్యాడు. వేధింపులు భరించలేక బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఈ ఘటన తమిళనాడులోని సేలం జిల్లాలో జరిగింది. తమిళనాడు రాష్ట్ర అసెంబ్లీలో బలవంతపు రికవరీ పద్ధతులను అరికట్టడానికి బిల్లును ఆమోదించిన రెండు రోజులకే ఈ మరణం సంభవించింది. జిల్లాలోని వళపడికి చెందిన తుక్కియంపాలయం నివాసి అయిన 55 ఏళ్ల వడివేలు, తన భూమిని తాకట్టుపెట్టి ఓ ప్రైవేట్ బ్యాంక్ నుంచి రూ. 4.80 లక్షల అప్పు తీసుకున్నాడు. ఏప్రిల్ 10న వాయిదా చెల్లించకపోవడంతో, మంగళవారం బ్యాంక్ లోన్ రికవరీ ఏజెంట్లు- వడివేలుని వేధించడం ప్రారంభించారు. బకాయి చెల్లించడానికి గడువు ఇవ్వడానికి కూడా నిరాకరించారు.దీంతో వేధింపులు భరించలేక వడివేలు పురుగుల మందు తాగి మరణించినట్లు- సమాచారం. రైతు మరణంతో గ్రామ ప్రజల్లో ఆగ్రహావేశాలు నెలకున్నాయి. న్యాయం కోరుతూ రైతు మృతదేహాన్ని తీసుకోవడానికి నిరాకరించారు. ఆ తర్వాత వజపాడి పోలీసులు ప్రైవేట్ బ్యాంక్ మేనేజర్‌ని ప్రశ్నించేందుకు అదుపులోకి తీసుకున్నారు. దీంతో రైతు మృతదేహాన్ని తీసుకునేందుకు కుటుంబీకులు అంగీకరించారు.

## నేడు రాజ్‌భవన్‌కు కాంగ్రెస్ నేతలు

### బిసి బిల్లు ఆమోదించినందుకు గవర్నర్‌కు కృతజ్ఞతలు

హైదరాబాద్,మే2: రాజ్‌భవన్‌లో శుక్రవారం ఉదయం 10:30 గంటలకు గవర్నర్ జిష్ణు దేవ్ వర్మను తెలంగాణ కాంగ్రెస్ బీసీ నేతలు కలవనున్నారు. ఏప్రిల్ 8వ తేదీన బీసీలకు రాజకీయ, విద్యా, ఉద్యోగాల్లో 42 శాతం రిజర్వేషన్లు పెంచుతూ శాసన సభలో చేసిన బిల్లుకు ఆమోదం తెలపడంతో గవర్నర్ జిష్ణు దేవ్ వర్మకి కాంగ్రెస్ బీసీ నేతలు ధన్యవాదాలు తెలపనున్నారు. ఉదయం రాజ్ భవన్ తెలంగాణ కాంగ్రెస్ బీసీ నేతల్లో మంత్రులు పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, పీసీసీ చీఫ్ మహేష్ కుమార్ గౌడ్ తో పాటు- మాజీ ఎంపీలు వి.హనుమంతరావు, కేశవరావు ,మధుయాష్కి గౌడ్, అంజన్ కుమార్ యాదవ్,రాజ్యసభ సభ్యులు అనిల్ కుమార్ యాదవ్, ఎమ్మెల్సీలు బస్వరాజు సారయ్య, దండే విఠల్, విజయశాంతి, నారాయణ, ప్రభుత్వ విప్‌లు ఆది శ్రీనివాస్, బీర్లఐలయ్య,ఎమ్మెల్యేలు,ముఖ్య నేతలు ఉన్నారు.

# మోడీ చాలా టఫ్! త్వరలోనే భారత్‌తో అమెరికా బిగ్ డీల్

హైదరాబాద్-మే 02: భారత్ - అమెరికా దేశాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందంపై జరుగుతున్న వేళ యూఎస్ ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్ (జీఱ ఝఅషెవ) కీలక వ్యాఖ్యలు చేశారు. త్వరలోనే భారతదేశంతో వాణిజ్య ఒప్పందం కుదుర్చుకోనున్నట్లు ప్రకటించారు. పరస్పర సుంకాలను నివారించడానికి వాణిజ్య ఒప్పందం కుదుర్చుకున్న మొదటి దేశాల్లో భారత్ కూడా ఉండొచ్చని తెలిపర్నా.భారత ప్రధాని నరేంద్ర మోడీ గురించి మాట్లాడుతూ జేడీ వాన్స ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. ప్రధాని మోడీ చాలా టఫ్‌నెగోషియేటర్ అని వ్యాఖ్యానించారు. మోడీ చాలా బాగా బేరసారాలు చేస్తారని, అందుకే తాము ఆయనను గౌరవిస్తామని జేడీ వాన్స్‌అన్నారు. 'భారత్ వ్యవసాయ ఉత్పత్తులపై అధిక సుంకాలు విధించడం వల్ల, అమెరికా రైతులు ఇబ్బందులు ఎదుర్కోవాల్సి వస్తోంది. అయితే భారత్ మాత్రం తమ దేశం నుంచి ఎన్నో ఏళ్లుగా ప్రయోజనం పొందుతోంది' అని జేడీ వాన్స్ చెప్పుకొచ్చారు. ప్రస్తుతం జరుగుతున్న చర్చల్లో అమెరికన్ వస్తువులకు కొత్త మార్కెట్లను తెరవడం, కార్మికులకు హాని కలిగించే అన్యాయమైన పద్ధతులను తొలగించడం మొదలైన విషయాలపై భారత్‌తో



చర్చిస్తున్నామని జేడీ వాన్స్ వివరించారు. వాణిజ్య ఒప్పందాల విషయంలో భారత్‌తో పాటుగా జపాన్, కొరియా తదితర దేశాలతోనూ చర్చలు జరుపుతున్నామని వాన్స్ వెల్లడించారు. కాగా, ఇటీవల భారత పర్యటనకు వచ్చిన జేడీ వాన్స్.. ప్రధాని నరేంద్ర మోడీతో ద్వైపాక్షిక చర్చలు జరిపారు. ట్రేడ్‌డీల్‌కుదుర్చుకునేందుకు భారత్, అమెరికా కొనసాగిస్తున్న చర్చల్లో పురోగతిపై ఇరుదేశాల నేతలు సంతృప్తి వ్యక్తంచేశారు. వ్యూహాత్మక సాంకేతికతలు, రక్షణ, ఇంధనం తదితర రంగాల్లో పరస్పర సహకారాన్ని మరింత పెంచుకోవడంపై దృష్టిసారించాల్సిన ఆవశ్యకత ఉందన్నారు.

రెండు దేశాల మధ్య ఉన్న వాణిజ్య సమతుల్యాన్ని కొనసాగించేందుకు అమెరికా నుంచి చమురు, గ్యాస్‌ల దిగుమతి పెంచుకోవాలని ప్రయత్నిస్తున్నట్లు భారత విదేశాంగ శాఖ అధికారులు వెల్లడించారు. డొనాల్డ్ ట్రంప్ కూడా భారత్‌తో వాణిజ్య ఒప్పందం చేసుకోవడానికి ఎదురు చూస్తున్నట్లు తెలిపారు. తాజాగా, జేడీ వాన్స్ ప్రకటనతో త్వరలోనే భారత్-అమెరికాల మధ్య ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందం కుదిరే అవకాశం ఉన్నట్లు తెలుస్తోంది.

## మరోసారి సీడబ్ల్యూసీకి పాలమూరు డీపీఆర్

### అధికారులకు మంత్రి ఆదేశం

హైదరాబాద్, మే2 : పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకం ప్రాజెక్టు డీపీఆర్‌ను సీడబ్ల్యూసీకి మరోసారి సమర్పించాలని తెలంగాణ సర్కారు తుదకు నిర్ణయించింది. ఈ మేరకు సంబంధిత అధికారులకు సాగునీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్‌కుమార్‌రెడ్డి ఆదేశాలు జారీ చేసినట్టు తెలిసింది. ఇరిగేషన్ శాఖ ఉన్నతాధికారులతో జలసౌధలో శుక్రవారం మంత్రి ప్రత్యేక సమీక్ష సమావేశాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అంతర్రాష్ట్ర అంశాలు, ఎన్జీటీ కేసులు, ప్రాజెక్టుల డీపీఆర్‌పై ఆరా తీశారు. ఈ క్రమంలో పాలమూరు ప్రాజెక్టుపైనా మంత్రి చర్చించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాతోపాటు రంగారెడ్డి జిల్లాలో 12.30 లక్షల ఎకరాలకు సాగునీటితోపాటు, తాగునీటిని అందించాలనే లక్ష్యంతో పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతల పథకాన్ని (పీఆర్‌ఎల్‌ఐఎస్) రూ.35 వేల కోట్ల అంచనా వ్యయంతో 2015లో అప్పటి బీఆర్‌ఎస్ ప్రభుత్వం శ్రీకారంచుట్టింది. మైనర్ ఇరిగేషన్‌లో వినియోగించుకొని 45 టీఎంసీలు, గోదావరి డైవర్షన్ ద్వారా వచ్చే 45 టీఎంసీలను మొత్తంగా 90టీఎంసీల నికర జలాలను పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల ప్రాజెక్టుకు కేటాయించారు. డీపీఆర్‌ను సిద్ధం చేసి 2022 సెప్టెంబర్‌లో సీడబ్ల్యూసీకి బీఆర్‌ఎస్ సర్కార్ హయాంలోనే సమర్పించారు. కేంద్ర పర్యావరణ, అటవీ మంత్రిత్వశాఖ పరిధిలోని ఎక్స్‌పర్ట్ అప్రయిజల్ కమిటీ (ఈఏసీ) నుంచి పర్యావరణ అనుమతుల కోసం 34వ ఈ ఏసీ సమావేశం నుంచే తీవ్ర ప్రయత్నాలను చేసింది. ఎట్టకేలకు 49వ ఈఏసీ అంగీకరించింది.



ప్రాజెక్టుకు అనుమతులు మంజూరు చేయాలని కేంద్రానికి సిఫారసు చేసింది. ఏడాదిన్నర గడిచినా కేంద్రం అనుమతులను మంజూరు చేయలేదు. కాంగ్రెస్ ప్రభుత్వంలో కేంద్రం ఏకంగా డీపీఆర్‌ను తిప్పి పంపింది. మైనర్ ఇరిగేషన్ ద్వారా ఆదా చేసే 45.66 టీఎంసీల వివరాలు ఇవ్వాలని అడిగినా, లేఖలు రాసినా కాం గ్రెస్ సర్కారు స్పందించడం లేదని సీడబ్ల్యూసీ ఆక్షేపించింది. గోదావరి నీటిని మళ్లించడం ద్వారా 45టీఎంసీల అంశం కూడా ట్రిబ్యునల్ పరిధి లో ఉన్నదని వెల్లడించింది. దానిపైనా స్పష్టత ఇవ్వాలని లేఖలు రాసినా స్పందించడం లేదని తెలిపింది.

## ఎకరాకు రూ.40 వేల పరిహారమివ్వాలి:

### మాజీ మంత్రి వీ శ్రీనివాస్‌గౌడ్



హన్వాడ,మే2: అకాలవర్షానికి తీవ్రంగా నష్టపోయిన రైతులకు ఎకరాకు రూ.40 వేల చొప్పున పరిహారం ఇవ్వాలని మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్ డిమాండ్ చేశారు. ఆరుగాలం కష్టపడి పండించిన ధాన్యం అకాలవర్షానికి తడుస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని ఆందోళన వ్యక్తంచేశారు. మహబూబ్‌నగర్ జిల్లా హన్వాడ మండల కేంద్రంలో శుక్రవారం రైతు సేవా సహకార సంఘం ఆవరణలో ఏర్పాటుచేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని శ్రీనివాస్‌గౌడ్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అధికారులు ధాన్యం కొనుగోలు ప్రక్రియను వేగవంతం చేయాలని కోరారు. రైతులకు సరిపడా గన్నీ బ్యాగులను ఉంచాలని సూచించారు. వర్షాలకు ధాన్యం కొట్టుకుపోతున్నదని వాపోయారు. పాలమూరు ప్రాజెక్టును త్వరగా పూర్తి చేయాలని డిమాండ్ చేశారు. పెద్దపల్లి జిల్లాలోని వివిధ గ్రామాల్లో గురువారం రాత్రి నుంచి కురిసిన వర్షానికి వరి, మిర్చి చేన్లతోపాటు మామిడితోటలు దెబ్బతిన్నాయి. మంథని వ్యవసాయ మార్కెట్‌లో రైతులు ఆరబోసిన ధాన్యం కొట్టుకుపోయింది. మండలంలోని ఆరెంద, గోపాల్‌పూర్, చిన్న ఓదెల, ఎక్లాస్‌పూర్‌లోని ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం తడిసిపోయింది. వివిధ గ్రామాల్లో కోత దశలో ఉన్న వరి పంట నేలవాలింది. అలాగే ముత్తారం మండలం ఖమ్మంపల్లిలో తీర్థాల మల్లయ్య, ఉగ్గే మల్లకకు చెందిన ధాన్యం కొట్టుకుపోయింది. మల్లయ్య మూడెకరాల ధాన్యం కొనుగోలు కేంద్రానికి తీసుకురాగా, సుమారు రెండెకరాల ధాన్యం కొట్టుకుపోయింది. ఉగ్గే మల్లకకు చెందిన ఎకరం ధాన్యం కాస్త మట్టిలో కొట్టుకుపోయింది. కేంద్రాల్లో ధాన్యం పోసి 20 రోజులు అవుతున్నా.. కొనుగోలు చేయకపోవడంతో ధాన్యం తడిసిపోయిందని బాధిత రైతులు ఆవేదన వ్యక్తంచేశారు. అడవిశ్రీరాంపూర్‌లో ధాన్యం రాశులు తడిసిపోయాయని తెలిపారు. ప్రభుత్వం తమను ఆదుకోవాలని వేడుకుంటున్నారు.

## మిల్లులో ధాన్యం దింపుకోవాలని రైతుల ఆందోళన

### జాతీయ రహదారిపై ట్రాక్టర్లు అడ్డుపెట్టి నిరసన

మాగనూరు/కృష్ణ, మే 2 : ధాన్యాన్ని రైస్ మిల్లు యజమానులు దింపుకోవడంలో నిర్లక్ష్యాన్ని నిరసిస్తూ రైతులు ఆందోళనకు దిగారు. శుక్రవారం నారాయణపేట జిల్లా మాగనూరు మండలం గుడెబల్లూరులో జాతీయ రహదారిపై ధాన్యం తీసుకువచ్చిన ట్రాక్టర్లను అడ్డుపెట్టి ఆందోళన నిర్వహించారు. మాగనూరు, కృష్ణ మండలాల నుంచి కొనుగోలు చేసిన ధాన్యాన్ని అధికారులు గుడెబల్లూరులోని పారజన్య రైస్‌మిల్లులో దింపాలని సూచించారు. ధాన్యాన్ని తీసుకువచ్చిన రైతులు రెండు,మూడు రోజులుగా ధాన్యం ట్రాక్టర్లు నిలుపుకొని మిల్లు వద్దే పడిగాపులు కాస్తున్నా మిల్లు యజమానులు వాటిని దించుకోవడంలో తీవ్ర నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. ఇతర ప్రాంతాల నుంచి లారీల్లో వచ్చిన ధాన్యాన్ని దించుకొని రైతులు తీసుకువచ్చిన ధాన్యాన్ని దించుకోకపోవడంతో ఆగ్రహించిన రైతులు ట్రాక్టర్లను జాతీయ రహదారిపై అడ్డుపెట్టి నిరసనకు దిగారు. దాదాపు గంటపాటు ఆందోళన నిర్వహించడంతో కిలోమీటర్ల పొడవునా ట్రాఫిక్ స్తంభించిపోయింది. విషయం తెలుసుకున్న తహసీల్దార్ వెంకటేశ్,



ఎస్సై నవీద్, పీఏసీసీఎస్ చైర్మన్ వెంకట్‌రెడ్డి అక్కడికి చేరుకొని వారి సమస్యను తెలుసుకున్నారు. పారజన్య రైస్ మిల్లులో దింపుకోవడానికి స్థలం లేకపోవడంతో కృష్ణ మండలం హిందూపూర్ శివారులోని వసుధ రైస్ మిల్లులో ధాన్యం దింపేందుకు ఏర్పాటు చేయడంతో రైతులు ఆందోళన విరమించారు.

# కాళేశ్వరమే రేపటి తెలంగాణ జీవధార

### రాష్ట్ర ప్రయోజనాలను కాపాడాలి

### మాజీ మంత్రి హరీశ్ డిమాండ్

### కాళేశ్వరంపై దేశ్‌పాండే రచించిన పుస్తకావిష్కరణ

### అద్భుత విజయాలను సాధించాం: నిరంజన్‌రెడ్డి

### మళ్లీ జలసాధన పోరాటాలు చేయాలి: ప్రకాశ్




హైదరాబాద్, మే2 : ముఖ్యమంత్రిగా కేసీఆర్ నిర్మించిన కాళేశ్వరం ప్రాజెక్టు రేపటి తెలంగాణ జీవధార అని మాజీ మంత్రి హరీశ్‌రావు స్పష్టంచేశారు. ఆ ప్రాజెక్టుపై సీఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న ప్రచారమంతా పచ్చి అబద్ధమని మండిపడ్డారు. రాజకీయ లబ్ధికోసమే ప్రాజెక్టుపై దుష్ప్రచారం చేస్తున్నారని, రైతాంగం ప్రయోజనాలను బలిపెడుతున్నారని ధ్వజమెత్తారు. ఇకనైనా ప్రాజెక్టును పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. తెలంగాణ సాగునీటిరంగ నిపుణులు శ్రీధర్‌రావు దేశ్‌పాండే రచించిన 'కాళేశ్వరం ప్రాజెక్టు : ప్రశ్నలు-విమర్శలు -వక్రీకరణలు-వివరణలు' 'సాగునీటి రంగంలో తెలంగాణ పదేండ్ల ప్రస్థానం' పుస్తకాల ఆవిష్కరణ కార్యక్రమం శుక్రవారం సాయంత్రం నాంపల్లి తెలుగు యూనివర్సిటీలో కొనసాగింది. తెలంగాణ వికాస సమితి ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమానికి ఎమ్మెల్సీ దేశపతి శ్రీనివాస్ అధ్యక్షత వహించగా, మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డితో కలిసి మాజీ మంత్రి హరీశ్‌రావు ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై జరుగుతున్న వక్రీకరణలను, ఏడాదిన్నర పాలనలో కాంగ్రెస్ పార్టీ సాగునీటి రంగాన్ని దెబ్బతీసిన విధానాలను ఈ సందర్భంగా హరీశ్‌రావు తీవ్రంగా ఎండగట్టారు. కేసీఆర్ నేతృత్వంలోని పదేండ్ల బీఆర్‌ఎస్ పాలనంలో తెలంగాణ సాగునీటి విజయ ప్రస్థానాన్ని గుర్తుచేశారు. కమిషన్లు, కమిటీల పేరిట ప్రభుత్వం ముప్పేట దాడిచేస్తున్న ఈ సమయంలో కాళేశ్వరం ప్రాజెక్టుపై వాస్తవాలను, తెలంగాణకు ప్రాజెక్టు ఎంత అవసరమో వివరిస్తూ పుస్తకాలను తీసుకొచ్చిన రచయిత శ్రీధర్‌రావును దేశ్‌పాండేను అభినందించారు. తెలంగాణపై ఆయన మమకారం, ప్రేమ.. తెచ్చుకున్న తెలంగాణలో నీళ్లు పారాలన్న తండ్లాటకు ఈ పుస్తకాలే నిదర్శమని కొనియాడారు. కాళేశ్వరం నిలబడితే, ఆ మంచి పనిని కొనసాగిస్తే కేసీఆర్ చరిత్ర పుటల్లో నిలిచిపోతారనే సీఎం రేవంత్‌రెడ్డి రాజకీయ కక్ష పెంచుకున్నారని హరీశ్‌రావు విమర్శించారు. రైతుల ప్రయోజనాలను, రాష్ట్ర ప్రయోజనాలను బలిపెట్టి రేవంత్‌రెడ్డి రాజకీయ లబ్ధి పొందాలని చూస్తున్నారని ధ్వజమెత్తారు. తాగునీటి రంగంలో కేసీఆర్ వందేండ్ల ముందుకు ఆలోచించి నిర్ణయాలు తీసుకున్నారని, అందుకు కాళేశ్వరమే నిదర్శమని వివరించారు. నాడు తట్ట మట్టి తీయకుండా రూ.వేల కోట్లను దోచుకున్న కాంగ్రెస్సే నేడు అవినీతి అంటూ మాట్లాడుతున్నదని నిప్పులు చెరిగారు. తన పుట్టినరోజు నాడు కూడా మహారాష్ట్రకు వెళ్లి తెలంగాణ ప్రయోజనాలను, అవసరాలను వివరించి ప్రాజెక్ట్ నిర్మాణానికి సహకరించాలని కేసీఆర్ విజ్ఞప్తి చేశారని గుర్తుచేశారు. సీడబ్ల్యూసీ సూచనలు, విశ్రాంత ఇంజినీర్ల నివేదికలు ఇలా అన్నివిధాలుగా ఆలోచించి తుమ్మిడిహట్టి నుంచి ప్రాజెక్టును మేడిగడ్డను మార్చారని తెలిపారు. తుమ్మిడిహెట్టి వద్ద బరాజ్ కడితే గ్రావిటీ ద్వారా నీరు వచ్చేవని మాట్లాడటం అవివేకమని, అక్కడ కూడా ఎల్లంపల్లి వరకు లిఫ్ట్ ద్వారానే వస్తాయని తెలిపారు.ప్రాణహిత-చేవెళ్ల ప్రాజెక్టు ఆయకట్టు 16 లక్షలు మాత్రమేనని, నీటినిల్వ సామర్థ్యం 16 టీఎంసీలేనని, కాళేశ్వరం ప్రాజెక్టుతో 37 లక్షల ఎకరాలకు నీరందనున్నదని, భవిష్యత్తు అవసరాలను దృష్టిలో పెట్టుకొని 141 టీఎంసీల నీటిని నిలువ చేసే రిజర్వాయర్లను కేసీఆర్ కట్టారని వివరించారు. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ అబద్ధాలను ప్రచారం చేస్తున్నదని, వాటిని పుస్తకం ద్వారా శ్రీధర్ దేశ్‌పాండే తిప్పికొట్టారని, వాస్తవాలను బయటపెట్టారని తెలిపారు. కాళేశ్వరం కూలిందని దుష్ప్రచారం చేస్తూనే మరోవైపు ప్రాజెక్టులో భాగమైన మల్లన్నసాగర్ నుంచి హైదరాబాద్‌కు తాగునీటిని తరలించేందుకు రేవంత్‌రెడ్డి సరారు టెండర్లను పిలిచిందని దుయ్యబట్టారు. ఇప్పటికైనా అజ్ఞానంతో మాట్లాడి విలువ తీసుకోకుండా సోయి తెచ్చుకోవాలని చురకలంటించారు. 2014 జూలైలోనే నాటి కేంద్ర నీటివనరుల శాఖ మంత్రి ఉమాభారతిని కలిసి కృష్ణానదీ జలాల పునఃపంపిణీ జరగాలని కేసీఆర్ పట్టుబట్టారని హరీశ్‌రావు గుర్తుచేశారు. కేంద్ర ప్రభుత్వాన్ని కలిసి ప్రధానమంత్రిని కలిసి, వినకపోతే సుప్రీంకోర్టులో కేసు కూడా వేశారని, సుదీర్ఘకాలం పోరాడి తుదకు సెక్షన్ 3ని సాధించిన ఘనత కేసీఆర్‌దేనని కొనియాడారు. తెలంగాణకు శాశ్వత పరిషారాన్ని కేసీఆర్ చూపించారని కొనియాడారు. తెలంగాణ ఉద్యమం నీళ్ల కోసమే, నీళ్ల చుట్టూనే కొనసాగిందని మాజీమంత్రి నిరంజన్‌రెడ్డి గుర్తుచేశారు. బీఆర్‌ఎస్ హయాంలో పాలమూరు జిల్లాలో అద్భుతాలను చేశామని వివరించారు. కాంగ్రెస్ సర్కార్ రాకతో మళ్లీ గతం పునరావృతమవుతున్నదని, చెరువులు ఎండిపోతున్నాయని ధ్వజమెత్తారు. సాగునీటిరంగ నిపుణులు వీ ప్రకాశ్ మాట్లాడుతూ.. కాళేశ్వరం ప్రాజెక్టుపై కాంగ్రెస్ దుష్ప్రచారం చేస్తున్నదని మండిపడ్డారు. రాజకీయ కక్షతో ప్రాజెక్టును పడావు పెడుతున్నదని తెలిపారు. మళ్లీ జలసాధనకు కోసం తెలంగాణ ఉద్యమించాల్సిన అవసరముందని నొక్కిచెప్పారు. కార్యక్రమలో సంగారెడ్డి ఎమ్మెల్యే చింతా ప్రభాకర్, జహీరాబాద్ ఎమ్మెల్యే మాణిక్‌రావు, అంబేదర్ వర్సిటీ మాజీ వీసీ కే సీతారామారావు, టీఎన్జీవో మాజీ అధ్యక్షుడు దేవీప్రసాద్, రాష్ట్ర గ్రంథాలయ సంస్థ మాజీ చైర్మన్ ఆయాచితం శ్రీధర్, రిటైర్డు ఇంజనీర్ల సంఘం ప్రధాన కార్యదర్శి టీ వెంకటేశం, సీనియర్ జర్నలిస్టు పీ వేణుగోపాలస్వామి, తెలంగాణ వికాస సమితి ప్రధాన కార్యదర్శి ఎర్రోజు శ్రీనివాస్, సాహితీ వేత్తలు, కవులు, కళాకారులు, వివిధ రంగాల నిపుణులు, తెలంగాణ ఉద్యమకారులు పాల్గొన్నారు.




# హిట్-3లో నాని నట విశ్వరూపం

## చీకటి కోణాన్ని ఆవిష్కరించే ప్రయత్నం








తెలుగు ప్రేక్షకులకు ఫ్రాంచైజీ రుచిని 'హిట్' సినిమాలు బలంగా చూపించాయి. నాని కీలక పాత్రలో 'హిట్: ది థర్డ్ కేస్'తో మూడో చిత్రం విడుదలయ్యింది. ప్రచార చిత్రాలు, ఫ్రాంచైజీపై ఉన్న నమ్మకం ఈ సినిమాపై మరిన్ని అంచనాల్ని పెంచాయి. దర్శకుడు శైలేష్ కొలను మూడో సినిమాతో ఎలాంటి ప్రభావం చూపించాడు. క్రూరత్వం నింపుకొన్న అర్జున్ సర్కార్ అనే పోలీస్ పాత్రలో నాని నటన ఎలా ఉందన్నదే సినిమా కథ. అర్జున్ సర్కార్ (నాని) ఐపీఎస్ అధికారి. జమ్మూకశ్మీర్‌లోని హోమిసైడ్ ఇన్వెస్టిగేటివ్ టీమ్ (హిట్)లో విధులు నిర్వర్తిస్తున్న క్రమంలో క్రూరమైన ఓ హత్య కేసు వెలుగులోకి వస్తుంది. అది ఎవరు చేశారో పరిశోధిస్తుండగా అచ్చం అదే తరహాలో దేశవ్యాప్తంగా 13 హత్యలు జరిగిన సంగతి వెలుగులోకి వస్తుంది. దీని వెనుక ఓ పెద్ద నెట్‌వర్క్ ఉందని అర్జున్ తెలుసుకుంటాడు. దాన్ని ఛేదించేందుకు బిహార్, గుజరాత్ తదితర ప్రాంతాలకు వెళ్తాడు. ఆ కేస్ కొలిక్కి వచ్చేలోపు అర్జున్ విశాఖకి బదిలీ అవుతాడు. అక్కడికి వచ్చాక కూడా ఈ కేస్‌ని ఛేదించేందుకు ఏం చేశాడు? వరుసగా జరుగుతున్న ఈ హత్యల వెనుక దాగిన చీకటి కోణాలేమిటి?వాటిని చేయిస్తున్నది ఎవరు? ఆయనకీ మృదుల (శ్రీనిధి)కీ మధ్య ఉన్న సంబంధం ఏమిటి? తదితర విషయాల్ని తెరపై ఆవిష్కరించారు. ఫ్రాంచైజీ వచ్చిన తొలి రెండు 'హిట్' సినిమాల్లో పరిశోధనాత్మక కోణమే ఎక్కువ. మూడో కేసుగా రాసుకున్న ఈ కథలో నేర పరిశోధనతో పాటు-, ఓ చీకటి ప్రపంచాన్నీ ఆవిష్కరించాడు దర్శకుడు. భయపెట్టే ఆ ప్రపంచంలోకి హీరో వెళ్లడం, తను అనుకున్న లక్ష్యాన్ని ఛేదించడం ఇందులో కీలకం. అయితే, ఆ చీకటి ప్రపంచాన్ని చూపించిన విధానంలోనే సమస్యలున్నాయి. నాని సినిమాలో అలాంటి ప్రపంచాన్ని చూడటం కాస్త ఇబ్బందిగా అనిపిస్తుంది. సమాజంలో హింసాత్మక ఆలోచనల్ని మరింతగా ప్రేరేపించినట్టుగా ఉండే ఈ చీకటి కోణం, రక్తం ఏరులై పారే సన్నివేశాలు సున్నిత మనస్తత్వమున్న ప్రేక్షకులకు మింగుడు పడవు. నిజంగా మన చుట్టూ ఉన్న మనుషులకి ఇలాంటి ఆలోచనలు వస్తే ఏమిటనే భయాన్ని పెంచుతుందీ చిత్రం. పలు హాలీవుడ్ చిత్రాల్ని గుర్తు చేసే ఈ కథ, నేపథ్యం... ఓ మంచి క్రైమ్ థ్రిల్లర్ అనుభూతినైతే పంచుతుంది. కథ, కథనాలు చాలావరకూ ఊహకు తగ్గట్టుగా సాగినా నాని నటన, ఆయన పోషించిన అర్జున్ సర్కార్ పాత్ర సినిమాని నిలబెడతాయి. సీటీకే ప్రపంచం ఒకటి ఉందని హీరో కనిపెట్టే సన్నివేశాలు సినిమాకి కీలకం. పద్మవ్యూహంలాంటి ఆ ప్రపంచంలోకి హీరో అడుగు పెట్టడం, అక్కడ చేసే పోరాటం ద్వితీయార్ధంలో కీలకం. ఓ గేమ్ తరహాలో సాగే యాక్షన్ ఘట్టాలు సినిమాకి హైలైట్. నాని తనలోని పతాక స్థాయి నటనను ఆవిష్కరించాడు. చాలాసార్లు నాని వన్ మ్యాన్ షో చేశాడు. అర్జున్ సర్కార్ పాత్రలో ఆయన ఒదిగిన తీరు, గాఢతతో కూడిన ఆయన నటన, పోరాట ఘట్టాలు ఈ సినిమాకి హైలైట్. కథానాయిక శ్రీనిధి శెట్టి పాత్రలోనూ బలం ఉంది. ప్రతినాయకుడిగా ప్రతీక్ బబ్బర్ నటన మెప్పించినా, విలనిజం హీరోకి సవాల్ విసిరేలా ఉండదు. సముద్రఖని, కోమలి ప్రసాద్ అలవాటైన పాత్రల్లోనే కనిపిస్తారు. పతాక సన్నివేశాల్లో పలువురు నటుల మెరుపులు సినిమాకి ప్రధాన ఆకర్షణ.

# శ్రీవిష్ణు సింగిల్ మూవీ డైలాగ్‌ల వివాదం

## మంచువిష్ణుకు క్షమాపణలు చెప్పిన శ్రీవిష్ణు

టాలీవుడ్ యంగ్ హీరో శ్రీవిష్ణు హ్యాట్రిక్ హిట్స్ తో దూసుకెళ్తున్నాడు. సినిమా సిన్మాలు తన మార్కెట్ పరిధి పెంచుతుంటూ తనకంటూ మినిమం గ్యారెంటీ మార్కెట్ ఉండేలా చేసుకున్నాడు. ఈ యంగ్ హీరో నటించిన లేటెస్ట్ సినిమా సింగిల్. గీతా ఆర్ట్స్ బ్యానర్ లో అల్లు అరవింద సమర్పణలో డైరెక్టర్ కార్తిక్ రాజు దర్శకత్వం వహించిన ఈ సినిమాలో హాట్ బ్యూటీ కేతికా శర్మ, లవ్ టుడే భామ ఇవానా హీరోయిన్లుగా నటిస్తున్నారు. వేసవి కానుకగా మే 9న ఈ చిత్రాన్ని విడుదల కానుంది. అందులో భాగంగా ఇటీవల ఈ మూవీ ట్రైలర్ రిలీజ్ చేశారు. అయితే ట్రైలర్ లో మంచు విష్ణు నటించిన కన్నప్ప సినిమాలోని శివయ్యా డైలాగ్ ను అలాగే మంచు కురిసి పోవడం వంటి కొన్ని డైలాగ్స్ ఇప్పుడు పలు వివాదాలకు కారణం అయ్యాయి. శ్రీ విష్ణు చెప్పిన ఈ డైలాగ్స్ కు కన్నప్ప టీమ్ నొచ్చుకోవడంతో వారికీ క్షమాపణలు చెప్తూ శ్రీ విష్ణు మాట్లాడుతూ మా సింగిల్' మూవీ ట్రైలర్‌కు ప్రేక్షకుల నుంచి చాలా మంచి రెస్పాన్స్ వచింది. అయితే ట్రైలర్‌లోని కొన్ని డైలాగ్స్ కు 'కన్నప్ప' టీమ్ హర్ట్ అయిందని తెలిసింది. తెలిసిన వెంటనే ఈ వీడియో చేస్తున్నాం. ఆ డైలాగ్స్ ఉద్దేశపూర్వంగా చేసినవి కాదు, అది తప్పుగా కన్వే అయింది. వెంటనే మేము ఆ సన్నివేశాలను సినిమాలో నుండి తొలగించాం.చిరు, బాలయ్య, వెంకటేష్, అల్లు అరవింద్ గారి రిఫరెన్స్ లను పాజిటివ్ గా తీసుకున్నాం. ఎవరికైనా ఇబ్బంది కలిగించి ఉంటే సారీ. ఇకపై ఇలాంటివి జరగకుండా చూసుకుంటాం. మేమంతా ఓ కుటుంబంలా ఉంటాం. ఒకరిని ఒకరం బాధపెట్టుకోవాలనే ఉద్దేశం నాకు లేదని వీడియో రిలీజ్ చేసాడు శ్రీ విష్ణు.



# సినిమాల కోసం ఆస్తులు అమ్ముకున్నాం

మూబీ డిజిస్టర్‌పై రకుల్ భర్త జాకీ భగ్నాని ఆవేదన టాలీవుడ్‌లో ఒకప్పుడు టాప్ హీరోయిన్‌గా ఓ వెలుగు వెలిగిన అందాల ముద్దుగుమ్మ రకుల్ ప్రీత్ సింగ్. తెలుగులో అవకాశాలు తగ్గాక బాలీవుడ్ చెక్కేసింది. అక్కడ ఆడపాదడపా సినిమాలు చేస్తూ తన స్నేహితుడు జాకీ భగ్నానిని వివాహం చేసుకుంది. పెళ్లయ్యాక కూడా వీరి రాత మారడం లేదు. రకుల్ నటిగా మంచి అవకాశాలు అందిపుచ్చుకోలేకపోతుంది. అలానే రకుల్ ప్రీత్ సింగ్ భర్త అయిన జాకీ నిర్మాతగా రాణించలేకపోతున్నారు. ఆయన బాలీవుడ్ అగ్ర నటులు అక్షయ్‌కుమార్, టైగర్ ష్రాఫ్ ప్రధాన పాత్రలలో 'బడే మియా ఛోటే మియా' అనే భారీ బడ్జెట్ చిత్రం నిర్మించారు. గత ఏడాది వేసవిలో విడుదలైన ఈ సినిమా బాక్సాఫీస్ దగ్గర బోల్తా కొట్టింది. అయితే ఈ మూవీ వైఫల్యంపై తాజాగా జాకీ స్పందించారు. ఈ చిత్రం వలన తాము ఆర్థికంగా ఎన్నో ఇబ్బందులు ఎదుర్కొన్నామని, సినిమా కోసం ఆస్తులు సైతం తాకట్టు పెట్టాల్సిన పరిస్థితి వచ్చిందని జాకీ స్పష్టం చేశారు. ఇది నాకు జీవితంలో ముఖ్యమైన గుణపాఠం నేర్పింది. ఒక ప్రాజెక్ట్‌ని భారీ స్థాయిలో నిర్మిస్తే సరిపోదని, మూవీ రిలీజ్ అయ్యాక అర్థమైంది. మా కథతో ప్రేక్షకులు ఎందుకు కనెక్ట్ కాలేకపోయారనే దానిపై ఒక్కసారి విశ్లేషించుకోవాలి. ప్రేక్షకుల నిర్ణయం సరైనదే కావచ్చు, వారిని తప్పు పట్టకుండా దీనిని ఒక పాఠంగా స్వీకరించి భవిష్యత్తులో ఇలాంటి పొరపాట్లు- జరగకుండా జాగ్రత్త పడాలి అని జాకీ అన్నారు. ఇక ఈ మూవీ కలెక్షన్స్ గురించి మాట్లాడిన ఆయన మేము పెట్టిన పెట్టు-బడిలో 50 శాతం తక్కువే వసూళ్లు వచ్చాయి. ఈ విషయాలు చెప్పడం వలన ఎలాంటి ప్రయోజనం ఉండదు కాని, లాభాలు ఆర్జించాలనే ఉద్దేశంతో చిత్రం తీసాం.కాని అనుకున్న లక్ష్యం చేరుకోలేకపోయాం అని జాకీ భగ్నానీ ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, అలీ అబ్బాస్ జాఫర్ దర్శకత్వంలో సైన్స్ ఫిక్షన్ యాక్షన్ ఎంటర్-టైనర్‌గా 'బడే మియా ఛోటే మియా' తెరకెక్కగా, ఇందులో పృథ్వీరాజ్ సుకుమారన్, మానుషి చిల్లర్, అలయ ఎఫ్, సోనాక్షి సిన్హా వంటి తారలు కీలక పాత్రలు పోషించారు.



# వేవ్స్ సమ్మిట్‌లో ఒక్కటైన తారలు



నాలుగు రోజులపాటు ప్రతిష్ఠాత్మకంగా వరల్డ్ ఆడియో విజువల్ అండ్ ఎంటర్‌టైన్‌మెంట్ సమ్మిట్ -వేవ్స్ ముంబై వేదికగా జియో వరల్డ్ కన్వెన్షన్ సెంటర్‌లో అట్టహాసంగా ప్రారంభమైంది. 'కనెక్టింగ్ క్రియేటర్స్.. కనెక్టింగ్ కంట్రీస్' అనే ట్యాగ్ లైన్ తో ఈ వేవ్స్ సమ్మిట్ ను నిర్వహిస్తుంది. ఇది మీడియా, వినోద పరిశ్రమలను ఒకచోట చేర్చే నాలుగు రోజుల కార్యక్రమం కాగా, ఆ కార్యక్రమానికి మీడియా, వినోద రంగానికి చెందిన సీఈఓలు, పరిశ్రమలకి చెందిన ప్రముఖులు హాజరు అయ్యారు. ఈ సదస్సును ప్రధాని మోదీ గురువారం ప్రారంభించారు. వేవ్స్ అనేది కేవలం ఒక పదం కాదని.. ఇది సంస్కృతి, సృజనాత్మకత, చలనచిత్ర సంగీతం, గేమింగ్, కథ చెప్పడం.. లాంటి కలయిక అంటూ వివరించారు. గత వందేళ్లలో భారతీయ సినిమా ఉన్నత శిఖరాలకి కూడా చేరుకుందని ప్రధాని స్పష్టం చేశారు. ఈ సమ్మిట్‌లో బాలీవుడ్ నటులు అమితాబ్ బచ్చన్,రణ్‌బీర్ కపూర్,దీపికా పదుకొనే, ప్రియాంక చోప్రా, రజనీకాంత్, చిరంజీవి, మోహన్ లాల్ సహా ఇతర ప్రపంచ తారలు పాల్గొన్నారు. అయితే రజనీకాంత్, మోహన్ లాల్, హేమ మాలిని, చిరంజీవి, అక్షయ్ కుమార్, మిథున్ చక్రవర్తి, మోహన్ లాల్ కలిసి ఓ గ్రూప్ ఫొటో దిగారు. ఈ పిక్ ఎంతగానో ఆకట్టుకుంది. చాలా రోజుల తర్వాత ఆ నాటి సీనియర్ హీరోలు అందరు కలిసి ఇలా ఫొటో దిగగా, ఇప్పుడు ఈ పిక్ నెట్టింట వైరల్ అవుతుంది. అలనాటి స్టార్స్ ఇలా ఒకే గ్రూప్ పిక్‌లో చూడడం చాలా ఆనందంగా ఉందని నెటిజన్స్ కామెంట్స్ చేస్తున్నారు. బుధవారమే చిరంజీవి ఈ కార్యక్రమం కోసం హైదరాబాద్ నుంచి ముంబయి చేరుకున్నారు. ఆయనకి నిర్వాహకులు ఘన స్వాగతం పలికారు. వేవ్స్ సమ్మిట్‌కి చిరు చాలా సింపుల్‌గానే వెళ్లారు.



# ఆచితూచి అడుగులేస్తున్న విశ్వక్‌సేన్

టాలీవుడ్ యంగ్ హీరోలలో మాస్ క దాస్ విశ్వక్ సేన్ వరుస సినిమాలతో బిజీగా ఉన్నాడు. లైలా డిజాస్టర్ తో కాస్త డిస్పాయింట్ అయిన విశ్వక్ సేన్ ఇప్పుడు చేయబోయే సినిమాల పట్ల ఆచి తూచి అడుగులు వేస్తున్నాడు. ఈ సారి ఎలాగైనా సూపర్ హిట్ కొట్టాలని కసితో ఉన్నాడు విశ్వక్ సేన్. బూతు, వల్గారిటీ లేకుండా ఫ్యామిలీ ఆడియెన్స్ ను దృష్టిలో పెట్టు-కుని సినిమాలు చేస్తున్నాడు విశ్వక్. అందులో భాగంగా జాతి రత్నాలు దర్శకుడు కెవి అనుదీప్ తో ఫంకీ అనే చేస్తున్నాడు. సితార ఎంటెటంల్గన్మెట్స్ బ్యానర్ పై నాగవంశీ ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. ఈ సినిమాతో పాటు మరి కొన్ని కథలు వింటున్న విశ్వక్ సేన్ మరో సినిమాను కూడా లాక్ చేసినట్టు తెలుస్తోంది. ఈ సినిమాకు కల్ట్ అనే -టైటిల్ కూడా రిజిస్టర్ చేసినట్టు సమాచారం. దర్శకుడు తదితర వివరాలు ఏవి తెలియలేదు కానీ ఈ సినిమాను మాజీ మంత్రి శ్రీనివాస యాదవ్ తనయిడు నిర్మిస్తున్నాడని తెలుస్తోంది. ప్రస్తుతం ఈ సినిమాకు సంబందించి ప్రీ ప్రొడక్షన్ వర్క్ పనులు చక చక జరుగుతున్నాయట. మిగిలిన వివరాలను త్వరలో అధికారకంగా ప్రకటించనున్నారు.

